సొంతింటి కల నెరవేరేనా..?


పరకాల పట్టణంలో మధ్యలోనే నిలిపివేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం


నాగారం గ్రామంలో దర్వాజా ఏర్పాటు తర్వాత నిలిచిన నిర్మాణం

- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- బేస్మెంట్ లెవల్‌కు రెండు లక్షల రూపాయలు దాటుతున్న ఖర్చు
- మేస్త్రీలు, కూలీలతో అదనపు భారం
- ఆర్థిక భారంతో లబ్ధిదారులు సతమతం

పరకాల : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే పేద ప్రజల ఇంటి కల నెరవేరడం ఖాయమని, అవసరమైతే లబ్ధిదారుడిపై ఆర్థికభారం పడకుండా ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు కంకర, సిమెంట్ అందేలా చర్యలు తీసుకుంటామని పాలకుల మాటలు ప్రచారాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు పట్టణంలో వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా పరకాల మున్సిపాలిటీ పరిధిలో 27.29 శాతం అంటే 469 ఇళ్లు మంజూరు కాగా అందులో 362 ఇళ్లకు అప్రోవల్ వచ్చింది. వాటిలో 101 ఇళ్లు బేస్మెంట్ లెవల్ వరకు పూర్తి అయ్యాయి. అలాగే మండలంలో 273 ఇళ్లగాకు 265 ఇళ్లకు అప్రోవల్ రాగా 128 బేస్మెంట్ లెవల్ పూర్తయ్యాయి.

దడ పుట్టిస్తున్న ధరలు

ఓ వైపు ఇసుక, మరోవైపు కంకర ధరలు మూడంతలు పెరగడంతో మండలంలోని 10 గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం తగ్గింది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్ల రావడంతో లబ్ధిదారులను పనులు వేగవంతం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కో దశలో అధికారులు లబ్ధిదారులకు చేతులు జోడించి తమకు పైనుంచి వస్తున్న ఒత్తిళ్లను వివరిస్తున్నారు. లేని పక్షంలో బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. అయితే పెరిగిన ధరలతో తాము అనుకున్న అంచన దాటి ఖర్చులు అవుతున్నాయని, ఏం చేయాలో అర్థం అవడం లేదని అధికారులకు లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో 15 ఇసుక క్వారీలు ఉండగా వర్షాల కారణంగా క్వారీలు నీటమునిగాయి. దీంతో పక్క జిల్లా జయశంకర్ భూపాలపల్లి వాగుల నుంచి ఇసుక తరలింపునకు పరకాల రెవెన్యూ అధికారులు టోకెన్‌లు జారీ చేస్తున్నా పర్మిట్ లేకుండా ఇసుక తరలించుకునేందుకు అధికారులు ససేమిరా అనడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనులు ప్రశ్నార్థకంగా మారాయి. కొందరు మొదటి బిల్లుతో బేస్మెంట్ వరకు పనులు చేసి నిలిపివేస్తే మరికొందరు పిలర్లు నిర్మించి పనులు నిలుపుదల చేశారు.

ఇసుక కొరతతో ఇంటి నిర్మాణం ఆపేశాం



ఇందిరమ్మ ఇల్లు వచ్చిందంటే సంతోషపడ్డాం. ఖర్చులు చూస్తుంటే భయమేస్తుంది. బేస్మెంట్ వరకే రూ.3లక్షలు ఖర్చయ్యాయి. అందుకే ఇసుక, కంకర తక్కువ ధర ఉన్నప్పుడే పనులు మొదలు పెట్టాలని ప్రస్తుతం పనులు ఆపేశాం. ప్రభుత్వం ఇచ్చిన రూ.1లక్ష కూలీలకు, మేస్త్రీలకు సరిపోయాయి.

– సుమలత, ఎస్సీ కాలనీ, పరకాల

అధికారులు చొరవ చూపాలి



ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, కంకర తక్కువ ధరకు లభించేలా చూడాలి. ఇసుకతో పాటు కంకర, సిమెంట్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో నాగారం గ్రామంలో 40 ఇల్ల పనులు బేస్మెంట్, పిల్లర్ల లెవల్‌లో నిలిచిపోయాయి.

– రాజు, మాజీ ఉపసర్పంచ్, నాగారం

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఆధ్యాత్మిక మండపం నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని అన్నారు. అనంతరం పంచకూట మహాదేవ స్వామి ఆలయంలో సతీసమేతంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మకూరు గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సామెల్, కాంగ్రెస్ నాయకులు రమేశ్, జైపాల్‌రెడ్డి, దేవరాజ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


శివాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

సర్వోదయ సేవలు అభినందనీయం

- డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

ఆత్మకూరు : సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడం అభినందనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో మంగళవారం సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్‌తో పాటు దంత, కంటి పరీక్షలు చేశారు. రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షల నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల్లో కూడా సర్వోదయ సంస్థ మెగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పేదల ఆరోగ్యంపై స్వచ్ఛంద సంస్థలు దృష్టి పెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్, వైద్యులు జితేందర్‌రెడ్డి, భరత్, సమాఖ్య డాక్టర్ సంపత్, ప్రణీతపాల్ జిప్సన్, సర్వోదయ సిబ్బంది కవిరాజ్, రవీందర్, అక్తర్, వనిత, శ్రీలత పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

దాతల సహకారం మరువలేనిది


టీషర్టులు పంపిణీ చేసిన అనంతరం విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఐనవోలు : విద్యార్థులకు అండగా నిలుస్తున్న దాతల సహకారం మరువలేనిదని ఎంఈఓ పులి ఆనందం అన్నారు. మంగళవారం మండలంలోని పున్నేలు ప్రభుత్వ పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధి కొయ్యడ భిక్షపతి రూ.65వేల విలువచేసే టీషర్ట్స్, షార్ట్స్, బెల్టులు, ఐడీ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆనందం స్థానిక ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు దాతల సహకారాన్ని వినియోగించుకుని చదువుపై శ్రద్ధ వహించి ఉన్నతంగా రాణించాలని సూచించారు. మరికొందరు దాతలు ముందుకొచ్చి పాఠశాలలో వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్ఎం రాసుధారెడ్డి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సదానందం, ఉపాధ్యాయులు అన్నారెడ్డి, ఇందిర, శిరీష, వెంకటేశ్వర్‌రావు, స్వప్న, సంధ్య, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేన్సర్‌కు మనోధైర్యమే మందు

- శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి

దామెర : కేన్సర్‌ను ఎదుర్కొనేందుకు మనోధైర్యమే మందులాగా పనిచేస్తుందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. మండల కేంద్రం శివారులోని ప్రతిమ కేన్సర్ ఇనిస్టిట్యూట్, ప్రతిమ ఫౌండేషన్, కేన్సర్ ఇనిస్టిట్యూట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో సంవత్సరంపాటు నిర్వహించనున్న ఉచిత మెగా స్క్రీనింగ్ శిబిరాన్ని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేన్సర్ ప్రాణాంతక జబ్బు కానప్పటికీ దానిపట్ల ప్రజలకు భయాందోళన ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధిని నివారించవచ్చని అన్నారు. వికాస తరంగిణి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి వ్యాధి అనుమానితులు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకునేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా మహిళలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం వికాసతరంగిణి కార్యకర్తలు, ప్రతిమ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉచిత స్క్రీనింగ్ పరీక్షల రిజిస్ట్రేషన్‌కు సెల్ నంబర్ 7729066702, 9345108108, 0870–6913300ను సంప్రదించాలని డైరెక్టర్ డాక్టర్ అవినాశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాహుల్, ప్రతీక్, సుమిత్ర, అశ్విని, తరంగిణి సెంట్రల్ కమిటీ సభ్యులు భవానీప్రసాద్, భాస్కర్ రావు, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రెసిడెంట్ రమేశ్ గుప్తా, సెక్రెటరీ దయాకర్, రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

చోరీ కేసులో దొంగ అరెస్టు

ధర్మసాగర్ : చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండలంలోని ఉనికిచర్ల ఫ్లైఓవర్ వద్ద ఎస్సై నరసింహారావు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై కనిపించినట్లు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా హసన్‌పర్తి మండలం, పలివేల్పుల గ్రామానికి చెందిన మిర్యాల భాస్కర్ అని చెప్పాడన్నారు. గత నెలలో ఉనికిచర్లలో ఓ ఇంటి తాళం ధ్వంసం చేసి బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. అలాగే అతడు చిల్పూరు, కమలాపూర్, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా దొంగతనాలు చేశానని ఒప్పుకోవడంతో అతన్ని తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అతని నుంచి సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, పల్సర్ బైక్, మొబైల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అతడిపై ఇప్పటివరకు సుమారు 30 దొంగతనాల కేసులు ఉన్నాయని ఈ సందర్భంగా సీఐ పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసు నమోదు

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఓ బాలిక అపహరణకు గురైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల గణేశ్–సరిత దంపతులు సోమవారం పరకాల మండలం కామారెడ్డిపల్లికి వెళ్లారు. ఇంటి వద్ద కుమార్తె సిరి, కుమారుడు అర్జున్ ఉన్నారని, సాయంత్రం తల్లిదండ్రులు వచ్చేసరికి బాలిక లేకపోవడంతో వెతికినట్లు తెలిపారు. ఎంతకూ కనిపించకపోవడంతో మంగళవారం బాలిక తల్లి సరిత ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. కాగా తమ కుమార్తెను పైడిపెల్లికి చెందిన జన్ను చరణ్ మాయమాటలు చెప్పి తీసుకెళ్లినట్లు నుమానం ఉందని ఫిర్యాదులో తెలిపినట్లు పేర్కొన్నారు.

గోడ కూలి మూగజీవాల మృతి

ఐనవోలు : మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పశువులపాక గోడ కూలి మూగజీవాలు మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలోని ఒంటిమామిడిపల్లిలో చోటుచేసుకుంది. భారీ వర్షానికి రాజారపు (శనిగల) బుచ్చయ్య పశువుల పాక గోడ కూలడంతో మూడు గొర్రెలు, రెండు మేకలు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వాల చిన్నచూపు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్

పరకాల : అంగన్‌వాడీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మండిపడ్డారు. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం అంగన్‌వాడీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించాలని, విద్యా బోధన బాధ్యతను అంగన్‌వాడీ హెల్పర్స్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు ప్రైవేటు స్కూల్‌లో చేర్పించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐసీడీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్‌టీయూ నుంచి 200 మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులు సీఐటీయూలో చేరారు. ప్రసన్న, జ్యోత్స్న, అనిత, సునంద, మల్లికాంబ, మాధవి, శశిరేఖ, పూల, రాణీ, రజిత, సంధ్య, రాజమ్మ పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీలు

డెంగీ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి


టెమోఫాస్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న సిబ్బంది

దామెర : డెంగీ బారిన పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రకుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో డెంగీ నివారణకు పైరేత్రమం, టెమోఫాస్ ద్రావణాన్ని మంగళవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డెంగీ కేసులు పెరుగుతున్న తరుణంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి చుట్టూ నీరు నిల్వకుండా చూడాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సూపర్‌వైజర్లు శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పరకాల ఏసీపీ సతీశ్‌బాబు

నడికూడ : భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సతీశ్‌బాబు సూచించారు. మంగళవారం శాయంపేట సీఐ రంజిత్‌రావు, పరకాల సీఐ క్రాంతికుమార్‌తో కలిసి కంఠాత్మకూరు వాగు వద్ద ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించారు. రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగుపై వరద ఉధృతి పెరగడంతో డైవర్షన్ వంతనపై హెచ్చరిక బోర్డు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.


కంఠాత్మకూరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఏసీపీ

క్లుప్తంగా

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన



పరకాల : మూడేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందినప్పటికీ బకాయిలు ఇప్పటికీ చెల్లించడం లేదంటూ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం పరకాల ఆర్టీసీ డిపో ఎదుట ధర్నాకు దిగారు. చాలీచాలని వేతనాలు తీసుకుని ఆర్టీసీ సంస్థకు అండగా ఉన్నప్పటికీ తమకు అన్యాయమే జరిగిందని వాపోయారు. ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధకరమని అన్నారు. బంక రవీందర్, ఏటీ రెడ్డి, షౌకత్‌అలీ, జనార్దన్, భద్రయ్య, మొగిళి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యంతో నిలిచిన ప్రాణం

నర్సంపేట : మండలంలోని ముత్తోజిపేటకు చెందిన బత్తుల నవీన్‌కు పట్టణంలో ఐకాన్ ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు నిలిపారు. వివరాలిలా.. ఆయన అర్షమొలలతో బాధపడుతూ ములుగు జిల్లాలోని ఓ ఆస్పత్రిలో చేరగా చికిత్స విఫలమై మలద్వారం పక్కన, వరిబీజాలకు ఇన్ఫెక్షన్ సోకి పొట్ట కండరాల వరకు సోకి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. నవీన్‌ను వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా భారీ మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో పేదరికంతో పెద్దమొత్తంలో ఖర్చు లేని దుస్థితిలో ఉండగా నర్సంపేటలోని ఐకాన్ ఆస్పత్రి వైద్యులు సేవాభావంతో వైద్యం అందించేందుకు ముందుకొచ్చారు. మత్తు వైద్యుడు శశిధర్‌రెడ్డి సహకారంతో ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ రాజు అత్యవసర శస్త్రచికిత్స చేసి 15 రోజుల వరుస చికిత్స, పర్యవేక్షణ అనంతరం మంగళవారం ఆరోగ్యకర స్థితిలో డిశ్చార్జ్ చేశారు.

రాములుకు జాతీయ స్థాయి పురస్కారం

నర్సంపేట రూరల్ : మండలంలోని చంద్రయ్యపల్లికి చెంది పల్లె రాములు స్టార్ ఆఫ్ తెలంగాణ జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. సోషల్ మీడియా వేదికగా మూడు వేలకుపైగా షార్ట్ ఫిల్మ్స్ నిర్మించి తెలంగాణ పల్లె ప్రజల జీవన విధానం, యాస భాషలతో ఆయన చేసిన కృషిని గుర్తించిన జాతీయ స్థాయి హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాములుకు జాతీయ అధ్యక్షుడు కొంపెల్లి సత్యనారాయణ, స్వర్ణగిరి ఆలయ అధినేత రామారావు పురస్కారం అందజేశారు.

'నీట్' మెటీరియల్ పంపిణీ

గీసుకొండ : మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు మండల ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్ మంగళవారం నీట్ పరీక్షల మెటీరియల్ అందజేశారు. అలాగే జేఈఈ పరీక్షల కోసం పుస్తకాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ ఉద్యమిస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు పంజాల రమేశ్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలు మంగళవారం నిర్వహించగా రమేశ్ అతిథిగా హాజరై జెండా ఎగరేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, కార్పొరేట్ శక్తులకు పరోక్షంగా మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని సూచించారు. పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాలక పవన్, నాయకులు లవన్, ధర్మేంద్ర, శివకుమార్, రమ్య, లావణ్య, కిరణ్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ

గీసుకొండ : మండలంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ చేపడుతున్నట్లు డీపీఎం వరలక్ష్మి తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధ్వర్యంలో మండలంలోని ప్రగతి మండల సమైక్య కార్యాలయంలో అధ్యక్షురాలు గట్టు రాధిక అధ్యక్షతన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై మంగళవారం నిర్వహించిన సమావేశానికి వరలక్ష్మి హాజరై మాట్లాడారు. మహిళా శక్తి డెయిరీకి సంబంధించి పాల సేకరణదారులను గుర్తించడానికి ప్రక్రియ చేపట్టినట్లు ఆమె చెప్పారు. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కోటి మందిని కోటీశ్వరులను చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వేలేరు : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఏఈ కుమారస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణగిరి, భీమదేవరపల్లి, వేలేరు తదితర సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు, లోఓల్టేజీ, మీటర్ రీడింగ్, ఇతర సమస్యలతో పాటు కొత్త కనెక్షన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, లైబ్రేరియన్ కవితారాణి, చంద్రకళ పాల్గొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

ఐనవోలు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 12 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ కోటగిరి సునీతా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 6, బైపీసీలో 6 సీట్లను స్పాట్ అడ్మిషన్ కల్పిస్తూ భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 63045 31650 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న రజనీకర్‌రెడ్డి

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్‌పై చర్య తీసుకోవాలని గుడెప్పాడ్ మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ వివిధ పన్నుల వసూలులో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. జిల్లా అధికారులు విచారణ జరిపి చర్య తీసుకోవాలన్నారు. మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య, బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, భిక్షపతి, కష్టారెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశ పాలన

పరకాల : రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి వంతపాడటం ఏంటని ప్రశ్నించారు. పెద్దగుడిలో పూజలను అడ్డుకోవడం అన్యాయమని, హౌజ్ అరెస్టులు హేయమైన చర్య అని ధ్వజమెత్తారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


మృతదేహానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కొడేపాక సమ్మయ్య మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంతోశ్, భాస్కర్, సమ్మయ్య, విజేందర్, స్వామి, రవీందర్ తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే నేరుగా వాగులోకే..



వేలేరు : మండలంలోని షోడాషపల్లి ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో ఈ రోడ్డు వెంట ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచి నడిపినా నేరుగా వాగులో పడే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.